

మాల్‌లో పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అభివృద్ధి పనులు భేష్

» పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్లు

యాచారం, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామంలో అభివృద్ధి పనులు భేషుగ్గా ఉన్నాయని, నగరానికి దీటుగా గ్రామంలో వసతులున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్లు వెస్లీ, రవీందర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా వార్డులు చాలా శుభ్రంగా ఉన్నాయని, హరితహారం నర్సరీ చాలా బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. పల్లె ప్రకృతి వనాన్ని చూసి పంచాయతీ సిబ్బందితోపాటు ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శి వైవీ.రాజులను అభినందించారు. గ్రామంలో రోజూ సిబ్బంది చేత వీధులను శుభ్రం చేయించాలన్నారు. స్వయం ఉపాధి పథకం కింద సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులో రుణాలు పొంది మేకల పెంపకం చేపట్టడం అభినందనీయమన్నారు, పంచాయతీ రికార్డుల మెయింటెన్ తీరు చాలా బాగుందని పేర్కొన్నారు. అనంతరం మాల్ మార్కెట్‌ను పరిశీలించారు. వారి వెంట జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఎల్‌పీవో సాధన, ఎంపీవో శ్రీలత తదితరులున్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు

» జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సురేశ్

యాచారం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కూరగాయల సాగు గణనీయంగా పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు రాయితీపై ఆధునిక వ్యవసాయ పనిముట్లతోపాటు మల్చింగ్, డ్రిప్, స్ప్రింక్లర్లను అందించడానికి కృషి చేస్తున్నామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేశ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహరావు తెలిపారు. చౌదర్‌పల్లి రైతు వేదికలో చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, గడ్డమల్లాయగూడ గ్రామాలకు చెందిన కూరగాయ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ దగ్గరగా ఉందని, తాజా కూరగాయలకు మంచి ధర వస్తుందని గమనించాలని రైతులకు సూచించారు. కూరగాయల తోటలకు సోకిన చీడపీడల నివారణకు సేంద్రియ ఎరువులు వాడితే చాలాకాలంపాటు కూరగాయలు తాజాగా ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం డివిజనల్ వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాతరెడ్డి, మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ - బీజాపూర్ హైవే విస్తరణ పనులపై మళ్లీ నీలినీడలు అలుముకున్నాయి. పర్యావరణ అనుమతులకు సంబంధించి తమ సూచనలు పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన హరిత ట్రిబ్యునల్ తక్షణమే అన్ని పనులు నిలిపివేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. మళ్లీ ఈఐఏ(ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్) ఇవ్వాలని ఆదేశించింది. చెట్లు, వన్యప్రాణుల సంరక్షణ కోసం అలైన్‌మెంట్ మార్పులు చేసే అవకాశాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అప్పటివరకు అన్ని అనుమతులను తాత్కాలికంగా పక్కనపెడుతున్నట్లు పేర్కొంది. అయితే ఈ ఉత్తర్వులపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదు. దీంతో ఈ రోడ్డు నిర్మాణ పనులు మళ్లీ మొదటికొచ్చాయి



వర్షం పడితే చేవెళ్ల మండల పరిధిలో రోడ్డు దుస్థితి

బీజాపూర్ హైవేకు గ్రహణం!


గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో పనులకు బ్రేక్

- కోర్టు ఆదేశాలపై అధికార యంత్రాంగం మీమాంస
- భారీ వృక్షాలు రీప్లాంటేషన్‌పై కోర్టు అసంతృప్తి
- అలైన్‌మెంట్ మార్పును పరిశీలించాలని ఆదేశం
- అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 4 లేన్ల విస్తరణకు బ్రేక్
- రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

నిత్యం రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలతో నరకప్రాయంగా ఉన్న హైదరాబాద్ - బీజాపూర్ హైవే విస్తరణను చేపట్టేందుకు ఐదేళ్ల కిందటే కేంద్రం అంగీకరించింది. ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి దీని విస్తరణ పనులకు కేంద్రం మొత్తం రూ.956 కోట్ల నిధులు విడుదల చేసింది. ఔటర్ రింగు రోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ మేర నాలుగు లేన్ల రహదారి విస్తరణకు సంబంధించి భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం కూడా దాదాపు అందించింది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. 'మేఘా' ఇన్‌ఫ్రా సంస్థ రూ. 786 కోట్లకు దక్కించుకుని రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టింది. బైపాస్ రోడ్డు నిర్మాణాలను వేగవంతంగా చేపట్టింది. భూసేకరణ, భూముల చదును పనులు చకచకాసాగాయి. అయితే నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు తొలగిస్తున్నారంటూ పర్యావరణవేత్తలు ఎన్జీటీని ఆశ్రయించారు. దీనిపై 2023 చివరిలో

మిగతా 7వ పేజీలో...



ఇప్పటికైనా నిజాలు చెప్పండి



హైదరాబాద్ - బీజాపూర్ హైవే నిర్మాణ పనులపై ప్రభుత్వం ప్రజలకు ఇప్పటికైనా నిజాలు చెప్పాలి. ఈ నిర్మాణ పనులు వెంటనే చేపడతామని అసెంబ్లీ సాక్షిగా రోడ్డు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. ఎన్జీటీ నుంచి అన్ని అనుమతులు వచ్చాయని చెప్పారు? ఇప్పుడు ఎన్జీటీ పనులు నిలిపివేయాలని ఆదేశించింది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. న్యాయస్థానం అనుమానాలను నివృతి చేసి వెంటనే అనుమతులు తీసుకుని పనులు చేపట్టాలి. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ త్వరలో ఈ ప్రాంత ప్రజలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

- పి.కార్తీక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు



మైసమ్మ ఆలయంలో అపురూప దృశ్యం

కడ్తాల్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ మైసిగండి మైసమ్మ ఆలయంలో అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. మంగళవారం అరుణోదయం వేళ మైసమ్మ దేవత విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకిన దృశ్యం సాక్షాత్కారమైంది. ఉదయం 11.50 గంటల నుంచి 12 గంటల వరకు భానుడి కిరణాలు అమ్మవారిని స్పృశించాయి. ఎన్నడూ లేనివిధంగా ఆలయంలోకి సూర్య కిరణాలు విమాన గోపురం మీదుగా మైసమ్మ విగ్రహం నుదుటి వరకు ప్రసరించడం ప్రత్యేకతను సంతరించుకుంది.

కరెంట్ షాక్‌తో రైతు మృతి



రాములు(ఫైల్)

కందుకూరు మే 13(ఆంధ్రజ్యోతి): కరెంట్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపురం గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మాదాపురం గ్రామానికి చెందిన మంద రాములు(49) పశువులకు గడ్డి కోయడానికి అదే గ్రామానికి చెందిన మంద యాదయ్య పొలం మీదుగా తన పొలానికి వెళ్తుండగా యాదయ్య బోరు మోటర్ వైర్ తేలి కింద పడి ఉంది. దానిని చూడకుండా రాములు కాలు పెట్టడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కుమారుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షం.. ఆగమాగం



కుంటను తలపిస్తున్న ఆమనగల్లు మార్కెట్ యార్డ్

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

ఇబ్బందుల్లో అన్నదాతలు

ఆమనగల్లు/మంచాల, మే 13(ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో సోమవారం రాత్రి 10 నుంచి 11.30 గంటల వరకు భారీవర్షం కురిసింది. దీంతో మార్కెట్ యార్డ్‌లో విక్రయానికి తెచ్చిన ధాన్యం పెద్దఎత్తున తడిసింది. ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు మార్కెట్ యార్డ్‌లోని కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చారు. గన్ని బ్యాగులు లేక సోమవారం కొనుగోళ్లు జరుగలేదు. తేమ శాతం ఎక్కువగా ఉండడంతో తూకాలు వేయలేదు. అకాల వర్షానికి కొంత ధాన్యం కొట్టుకుపోయింది. సీసీ సరిగా లేక మార్కెట్ యార్డ్ ఆవరణ కుంటను తలపించింది. గన్ని బ్యాగుల కొరత లేదని, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశామని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, సీఈవో ప్రతాప్ రెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డులో వర్షం నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ తెలిపారు.



వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

మంచాలలో మోస్తరు వాన

మంచాలలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో మోస్తరు వర్షం కురిసింది. పది రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జనం ఇబ్బందులు పడ్డారు. రాత్రి పూట కరెంటు పోతే ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. తాజాగా కురిసిన మోస్తరు వర్షంతో వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి ఉపశమనం లభించి ఊపిరి పీల్చుకున్నారు.



మంచాలలో కురుస్తున్న వర్షం

సిబ్బంది కొరత.. విద్యుత్ కోత!

18 మంది ఉండాల్సిన చోట ఐదుగురే..



షాద్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్

- 45 వేల కనెక్షన్లు, ఐదుగురు లైన్‌మెన్లు
- డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి ఉన్నా తప్పని అవస్థలు
- కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్న షాద్‌నగర్‌వాసులు

షాద్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది కొరతతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో వచ్చే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించడానికి తగిన సిబ్బంది లేకపోవడంతో గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో షాద్‌నగర్‌లో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని, నిమిషం పాటు కూడా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం లేదంటూ ప్రభుత్వం ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

విద్యుత్ సరఫరా ఇలా..

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 45 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి షాద్‌నగర్ ఏఈ పరిధిలోని 18 ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో సాధారణ జనంతోపాటు వివిధ వ్యాపార సంస్థలు, పరిశ్రమలు ఉండటంతో ఇక్కడ నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో

మిగతా 8వ పేజీలో...

సరఫరాలో అంతరాయం వల్లే..



షాద్‌నగర్ పట్టణ పరిధిలో విద్యుత్ కోతలు లేవు. డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. సరఫరాలో అంతరాయాలు రావడం వల్లే సరఫరాను నిలిపివేయాల్సి వస్తుంది. సిబ్బంది కొరత కూడా భారంగా మారింది. 18 మంది ఉండాల్సిన చోట కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఒక్కరే మరమ్మతు చేయాల్సి వస్తోంది. ఫలితంగా విద్యుత్ సరఫరాను కాస్త ఎక్కువ సమయం నిలిపివేయాల్సి వస్తుంది. కానీ, ఎలాంటి అప్రకటిత విద్యుత్ కోతలు విధించడం లేదు.

- వినోద్‌కుమార్, ఏఈ, షాద్‌నగర్ టౌన్

ఏళ్ల సమస్యకు 'భూ భారతి'తో పరిష్కారం

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, మే 13(ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవునిపల్లిలో 30 ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు భూ భారతి రెవెన్యూ సదస్సులతో శాశ్వత పరిష్కారం లభించనుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండలం ఎంకిర్యాల, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లో తహసీల్దార్లు జగదీశ్వర్, రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో లోపభూయిష్టంగా ఉన్న ధరణి పోర్టల్‌ను రద్దుచేసి భూ భారతి పోర్టల్‌ను తెచ్చామన్నారు. దీంతో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. లక్ష్మీదేవునిపల్లిలో 30 ఏళ్లుగా 84 మందికి సంబంధించిన రైతుల భూ సమస్య తీరబోతుందని మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ ఉప సర్పంచ్ పసుపుల రాజేష్ తోపాటు కొంత మంది రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సీసీఎల్ఏ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, నర్సింహముదిరాజ్, నర్సింహ, లంకాల రామకృష్ణారెడ్డి, మల్లయ్య, రాంచంద్రయ్య రెవెన్యూ సిబ్బంది మహేందర్‌గౌడ్, ప్రకాష్, రాకేష్, శివకుమార్ అంజనేయులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నీరటి అనురాధ, సంఘం మహిళలు

మహాధర్నాను విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్కుడలో మంగళవారం తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి మల్లేశ్, జిల్లా మహిళా మత్స్యకార ఆర్గనైజింగ్ కమిటీ కో-కన్వీనర్ అనురాధ ఆధ్వర్యంలో మత్స్యకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 15న జరిగే మత్స్యకారుల మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. మత్స్య మిత్ర మహిళా గ్రూపులను పునరుద్ధరించి మహిళా మత్స్యసొసైటీలకు రూ.10లక్షల చొప్పున సాయమందించాలన్నారు. 50ఏళ్లు నిండిన మత్స్యకారులకు పింఛన్‌లు మంజూరు చేయాలన్నారు. ఎన్సీడీసీ, ఎన్ఎఫ్‌డీబీ పథకాల కింద 90శాతం స బ్సిడీ రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నీరటి అనురాధ, జ్యోతి, మాధవి, సవిత, స్వప్న, లతిక, రజిత, లత, సుష్మ, సరస్వతి, లక్ష్మి,నాగమణి, ఈశ్వరమ్మ, విజయలక్ష్మి, మమత పాల్గొన్నారు.



చిట్టడవుల్లా క్రీడాప్రాంగణాలు

- నిర్వహణ లేక నిరుపయోగం
- బోర్డులే తప్ప మైదానాల్లో సౌకర్యాలు నిల్
- గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మొయినాబాద్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం క్రీడామైదానాలను ఏర్పాటు చేసింది. ప్రతీ మైదానాన్ని కనీసం ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేసి బోర్డులు, ఆర్చ్‌లు పాతారు. అయితే వాటి నిర్వహణ లేక నిరుపయోగంగా మారిపోయాయి. క్రీడా ప్రాంగణాలు చెట్లు, పొదలతో నిండి చిట్టడవులను తలపిస్తున్నాయి. గ్రామీణ క్రీడా మైదానాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే. కానీ సిబ్బంది, అధికారులు వాటిని పట్టించుకోక నిరుపయోగంగా మారాయి. ఈ మధ్య కొందరు తమ సొంత స్థలాల్లో ప్రైవేట్ మైదానాలను ఏర్పాటు చేస్తున్నారు. వాటిని అన్ని హంగులతో నిర్మించి క్రీడాకారులకు, ఆటవిడుపు కోసం వచ్చే వారికి అద్దెకిస్తున్నారు. వాటిల్లో ఆటలాడాలంటే వేలల్లో డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అయితే గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో మాత్రం సౌకర్యాల్లేవు.



చెట్లు పొదలతో నిండిన హిమాయత్‌నగర్‌లో క్రీడా ప్రాంగణం



అజీజ్‌నగర్‌లో క్రీడా ప్రాంగణంలో చెట్లు, పొదలు

పట్టించుకునే నాథుడు లేడు...

మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో 15 క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. క్రీడా పరికరాలు లేవు. వాలీబాల్ ఆడాలంటే నెట్టు కట్టుకునే పోల్స్ కూడా పాతలేదు. వాటిల్లో క్రీడలు ఆడక చెట్లు, పొదలతో నిండాయి. క్రీడా ప్రాంగణాలన్నీ నిరుపయోగంగానే ఉన్నాయి. ఇది క్రీడా ప్రాంగణం అని చెప్పలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడామైదానాలను చదును చేసి అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు, గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



ప్రభుత్వం ఆట మైదానాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణను పట్టించుకునే వారు లేక ప్రాంగణాలు అధ్వానంగా మారాయి. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు ప్రైవేట్ మైదానాల్లో డబ్బు చెల్లించి వెళ్తున్నాం. ఇప్పటికైనా అధికారులు క్రీడా మైదానాలను అందుబాటులోకి తేవాలి.

- మోర శ్రీనివాస్, క్రీడాకారుడు, రెడ్డిపల్లి

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం

మొయినాబాద్ మండలంలో 15 మైదానాలున్నాయి. వీటి నిర్వహణ చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. ప్రభుత్వం సిబ్బందికి సర్వే, ఇతర పనులు అప్పగించింది. త్వరలోనే మైదానాలను అందుబాటులోకి తెస్తాం. వీటికి నిధులు కూడా అంతంత మాత్రంగానే వస్తాయి. ప్రస్తుతం మా దృష్టి ప్రజల దాహార్తి తీర్చడంపైనే ఉంది.

- సంధ్యారాణి, ఎంపీడీవో, మొయినాబాద్

కూతురు, అత్తపై కత్తితో దాడి

- గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మేడ్చల్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఓ వ్యక్తి తన కూతురు, అత్తపై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాలపాలు చేశాడు. అనంతరం అదే కత్తితో తన గొంతు కోసుకుని ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటన మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండలం నూతన్‌కల్ గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్న మహారాష్ట్రకు చెందిన శైలేందర్ అంబాదే(40) సోమవారం రాత్రి తప్పతాగి ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంట్లో ఉన్న కూతురు హన్సాన్(12)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దురాగతాన్ని అడ్డుకునే యత్నం చేసిన శైలేందర్ అత్త రూమన్ సహారే(68) ఆమెపైనా అతడు దాడి చేశాడు. గాయపడ్డ వారు అరుపులు కేకలు వేయటంతో ఆదే కత్తితో తన గొంతు కోసుకున్నాడు. అనంతరం ఇంటిపై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. శైలేందర్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అక్కడికి చేరుకుని శైలేందర్, హన్సాన్, సహారేలను సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.



కత్తిపోటుతో గాయపడిన హన్సాన్


స్పృహ కోల్పోయిన శైలేందర్

నకిలీ ఐస్‌క్రీమ్ తయారీదారుల అరెస్టు

కులకచర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో నకిలీ ఐస్ క్రీమ్ తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. పక్కా సమాచారంతో మంగళవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం పర్వతపురం గ్రామానికి చెందిన ఎండీ.అజీమ్ తపాల కార్యాలయం సమీపంలో ఇంటిని అద్దెకు తీసుకొని గడువు ముగిసిన పదార్థాలతో ఐస్‌క్రీమ్ తయారు చేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనిల్, రాంపాల్‌తో విక్రయిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో గడువు ముగిసిన పదార్థాలను గుర్తించి వారిని పోలీసులకు అప్పగించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు.


నకిలీ ఐస్‌క్రీమ్ తయారు చేస్తూ పట్టుబడిన వ్యక్తులు





గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

బొంరాస్‌పేట్, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుటోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్లలో సీఆర్‌ఆర్ నిధులు రూ.20లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామాలు, తండాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు,గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, కృష్ణ, దేశ్యానాయక్, బాల్‌రాజ్‌గౌడ్, అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

దివ్యాంగులకు అంత్యోదయ కార్డులివ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేశ్


దోమ, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులు అందరికీ అంత్యోదయ కార్డులు ఇవ్వాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి డీటీ నర్సిములుకు వినతిపత్రం ఇచ్చారు. దివ్యాంగులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తమిళనాడు ప్రభుత్వం పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్‌లు కల్పించిన మాదిరిగా తెలంగాణలో దివ్యాంగులకు రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. విధంగా పింఛన్ రూ.6వేలకు పెంచడంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో 100శాతం రాయితీతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోతురాజు, దోమ మండల అధ్యక్షుడు చుక్కయ్య, నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య, మహేశ్ పాల్గొన్నారు.

భూ భారతి సదస్సుల్లో దరఖాస్తుల స్వీకరణ

ధారూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గురుదోట్ల, దోర్నాల్, కుమ్మర్‌పల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవిన్యూ సదస్సుల్లో 35 దరఖాస్తులు అందాయి. గురుదోట్ల, కుమ్మర్‌పల్లి సదస్సుల్లో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర పాల్గొని రైతుల దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. వివిధ రకాల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంతో పరిష్కరించుకోవచ్చని రైతులకు చెప్పారు. గురుదోట్లలో 17 దరఖాస్తులు రాగా మిస్సింగ్ సర్వే నంబర్లు 2, భూ విస్తీర్ణం సవరణకు 5, పట్టాదారు వివరాల నమోదకు 6, సక్సెషన్‌కు2, డీఎస్ పెండింగ్‌కు2 దరఖాస్తులు వచ్చాయి. దోర్నాల్‌లో వచ్చిన 9 దరఖాస్తుల్లో ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు 3, సక్సెషన్‌కు 2, భూ విస్తీర్ణం సవరణకు 4 దరఖాస్తులు అందాయి. కుమ్మర్‌పల్లిలో 9దరఖాస్తులు రాగా, మిస్సింగ్ సర్వే నంబర్లకు 2, ఇంటిపేరు మార్పునకు ఒకటి, సక్సెషన్‌కు 2, డీఎస్ పెండింగ్‌కు 1, ఇతర సమస్యలపై మూడు దరఖాస్తులు వచ్చాయని రెవిన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదా బేగం, శ్రీనివాస్, డీటీ విజయేందర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


కుమ్మర్‌పల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర





సైనిక్ స్కూల్ ఏర్పాటే ధ్యేయంగా కృషి

కీసర రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటే ధ్యేయంగా కృషి చేస్తామని కాంతి కీన్ ఫౌండేషన్ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏపీలోని కోరుకొండ, కలికిరిలోని సైనిక్ స్కూల్లలో తెలంగాణ విద్యార్థులకు ప్రవేశాలను నిషేధించడంతో ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు, వారి తల్లితండ్రులతో కలిసి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబులను కలిశారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ తెలంగాణాలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం రకాల కృషి చేస్తోందన్నారు. రక్షణ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఫోన్‌చేసి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత పదేళ్లలో సైనిక్ స్కూల్ ఏర్పాటుపై నిర్లక్ష్యం చేశారన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి హరితకు వివరించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటయ్యేంత వరకు పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రవేశపరీక్ష రాసిన 20వేల మంది విద్యార్థుల తరఫున ప్రయత్నాలు చేస్తామన్నారు. అధికారులు, మంత్రులు రాష్ట్రంలో సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో లావణ్య, కల్యాణి, సంతోష్ మనోజ్, జాకబ్ పాల్గొన్నారు.


మంత్రి ప్రభాకర్‌తో మాట్లాడుతున్న ప్రతినిధులు

ముగిసిన క్రికెట్ టోర్నీ

- బహుమతులు అందజేసిన నాయకులు

తలకొండపల్లి,మే13(ఆంధ్రజ్యోతి): లింగరావుపల్లిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అండర్-14 క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. వివిధ గ్రామాల పది టీంలు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో లింగరావుపల్లి, దేవుని పడకల్ టీంలు తలపడ్డాయి. దేవునిపడకల్ టీం ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. విజేతకు జీనుకుంట్ల తిరుపతిగౌడ్ రూ.5వేల నగదు,షీల్డ్, రన్నర్‌కు మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు ఇమ్రాన్ రూ. 3వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. క్రీడలు మానసిక వికాసానికి దోహద పడుతాయని వారు అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిగౌడ్, మణికంఠ, రబ్బానీ, అంజయ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.


క్రీడాకారులకు షీల్డ్‌లు బహూకరిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కాంతయ్య

ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలి

చేవెళ్ల, మే 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల బిల్లులు వెంటనే చెల్లి ంచాలని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అనుబంధ బీకేఎంయూ నాలుగు మండలాల మహాసభను మంగళవారం చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలు పని చేసేచోట కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. మంచినీరు టెంట్, హెల్త్‌కిట్, రవాణా వంటి సదుపాయాలు, అలాగే పనిముట్లు పారలు, గడ్డపారలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి సత్యనారాయణ, రైతు సంఘం జి ల్లా ప్రధాన కార్యదర్శి ప్రభులింగం, యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ప్రధానకార్యదర్శి జంగయ్య, మక్బూల్,యశోద, కుందన్‌బాయి, వెంకటేశ్, రాములు, మల్లేష్, నర్సింహులు, సత్యనారాయణ, నర్సింలు, జంగయ్య, నత్తిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక మహోత్సవంలో ప్రజలకు ఆశీస్సులు అందజేస్తున్న బిషప్‌లు

ఘనంగా ఫాతిమా మాత మహోత్సవం

కొత్తూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఫాతిమాపూర్‌లో వెలసిన ఫాతిమామాత వార్షిక మహోత్సవాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బిషప్ ప్రిన్స్ అంథోని, చర్చి ఫాదర్ సైమన్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ క్రైస్తవులకు శాంతి సందేశాలు వినిపించారు. ఫాతిమామాత ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. వార్షిక మహోత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఫాతిమామాత చర్చిని విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో పలువురు మత గురువులు, మాజీ వార్డు సభ్యుడు అల్వీన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, మల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వినయ్, గ్రామస్తులు లూర్థూరెడ్డి, యాగారెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన లియాఫీ నూతన కార్యవర్గం

లియాఫీ అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

వికారాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): లియాఫీ(ఎల్ఐసీ బ్రాంచ్ ఏజెంట్ల సంఘం) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం లియాఫీ భవనంలో ఎల్ఐసీ బ్రాంచ్ ఏజెంట్ల సంఘం(లియాఫీ) 14వ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిచ్చన్నగారి వెంకట్‌రెడ్డి(చేవెళ్ల), ప్రధాన కార్యదర్శి విజయేందర్‌రెడ్డి, కోశాధికారి కేతావత్ పాండు, కన్వీనర్‌గా కృష్ణకుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లియాఫీ సీనియర్ నాయకులు సింగారపు శ్రీనివాస్, పూరి వెంకటేశం, ఎన్.బసవలింగం పటేల్, బీఎం చారి, బాలకృష్ణారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, కేఎస్ఎస్.రెడ్డి, కృష్ణారెడ్డి, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సుదర్శనం, కోశాధికారి సీనయ్య, బ్రాంచ్ పీఎస్టీలు శ్రీనివాస్, మాణిక్‌రెడ్డి, శేఖర్‌స్వామి, మనోహర్‌రెడ్డి, వివిధ ప్రాంతాల ఏజెంట్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసచారి

ఏకాగ్రతతో చదివితేనే మంచి మార్కులు

వికారాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): ఏకాగ్రత, ఇష్టంతో చదివితేనే పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని విషయ నిపుణులు, ప్రముఖ మోటివేటర్ కె.శ్రీనివాసచారి అన్నారు. మంగళవారం వికారాబాద్లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'టెట్‌లో మంచి మార్కులు సాధించడం ఎలా?' అనే అంశంపై అభ్యర్థులకు పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. టెట్‌లో ప్రతీ మార్కు కీలకమన్నారు. పాఠ్యపుస్తకాలను సమగ్రంగా చదవాలని, ఎక్కడి నుంచి ప్రశ్నలొచ్చినా సమాధానం రాసేలా అవగాహన పెంచుకోవాలని సూచించారు. చదివే ప్రతీ అంశాన్ని ఆకలింపు చేసుకుంటనే సమాధానాలు రాయగలుగుతారన్నారు. పరీక్ష రాసేప్పుడు ఆత్మస్థైర్యం కోల్పోకూడదని, ఎక్కువ మార్కులు సాధిస్తానన్న విశ్వాసంతో రాయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, ఉద్యోగులు లక్ష్మప్ప, ముంతాజ్, సరిత తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న లావణ్యదేవేందర్‌యాదవ్

అంచలంచెలుగా సమస్యల పరిష్కారం

కొత్తూర్, మే 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో భూగర్భ మురుగు నీటి కాలువలను నిర్మిస్తూ క్రమంగా సమస్య పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. అక్కవానిగూడ 1వ వార్డులో రూ.5లక్షలతో నిర్మించే మురుగునీటి కాలవ పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపాలిటీలో న్ని వార్డుల్లో డ్రైయిన్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాధవిగోపాల్‌గౌడ్, మాదారం నర్సింహాగౌడ్, కోస్గి శ్రీనివాస్, చంద్రకళరాజేందర్‌గౌడ్, సోమ్లనాయక్, జయమ్మజనార్ధన్‌చారి, ప్రసన్నలతయాదయ్య, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్ హైవేకు గ్రహణం!



చేవెళ్ల మండలంలో ఇరుకుగా బీజాపూర్ రహదారి

(ఐదో పేజీ తరువాయి)

ఎన్జీటీ స్టే ఇచ్చి మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు సకాలంలో నివేదిక ఇవ్వలేదు. దీంతో ఎన్నికలకు ముందుగానే ఈ పనులు నిలిచిపోయాయి. స్థానిక రాజకీయ పరిస్థితులు కూడా ఇబ్బందికరంగా మారడంతో సదరు రోడ్డు నిర్మాణ సంస్థ నిర్మాణ సామగ్రిని ఇతర ప్రాంతాలకు తరలించింది.

మొక్కల రీప్లాంటేషన్‌పై అభ్యంతరాలు

ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రహదారి విస్తరణ పనులపై తొలుత హడావిడి చేసింది. రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్థానిక ఎమ్మెల్యేలను తీసుకుని కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కరీని కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా పలుమార్లు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఎన్జీటీ అభ్యంతరాలపై నిపుణులతో చర్చించి కోర్టుకు నివేదిక పంపారు. తరువాత కేంద్రం నుంచి అన్ని అనుమతులు వచ్చాయని, ఎన్జీటీ ఆదేశానుసారంగా రహదారి విస్తరణలో అడ్డుగా ఉండే భారీ వృక్షాలను రీ ప్లాంటేషన్ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో బీజాపూర్ హైవే పనుల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించారు. రోడ్డు విస్తరణలో తొలగించే భారీ వృక్షాలను రీప్లాంటేషన్ చేయాలని సూచించారు. ఇదిలాఉంటే భారీ వృక్షాల రీప్లాంటేషన్ ఇతర పర్యావరణ అంశాలపై అధికారులు ఇచ్చిన నివేదికను ఎన్జీటీ తప్పుపట్టింది. రీ ప్లాంటేషన్ తర్వాత ఎన్ని వృక్షాలు బతికాయి? అనే వివరాలపై నివేదిక కోరింది. మళ్లీ ఈఐఏ(ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్) ఇవ్వాలని అప్పటివరకు అన్ని అనుమతులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. దీంతో మళ్లీ కథ మొదటికి వచ్చింది? ఈ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు వేసి ఇప్పటికే రెండున్నరేళ్లుదాటింది. నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ గతంలో కోట్‌చేసిన ధరకు పనులు చేసే అవకాశాలు ఉండవు. దీంతో మళ్లీ అంచనాలు పెంచాల్సి ఉంటుంది. ఇదంతా చూస్తే హైదరాబాద్-బీజాపూర్ హైవే పనులు ఇప్పట్లో మొదలవుతాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈఐఏ ఎవరు చేయాలి?

ఎన్జీటీ తాజా ఆదేశాలతో మళ్లీ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్ ఎవరు చేయాలనేది ప్రశ్నార్థకరంగా మారింది. గతంలో ఈ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భవనాల శాఖ ద్వారా ఈఐఏ చేసింది. అయితే ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చి నిర్మాణ పనుల బాధ్యత కేంద్రం తీసుకుంది. దీంతో ఇప్పుడు ఎన్జీటీ ఆదేశాల మేరకు ఈఐఏ నివేదిక కేంద్ర రోడ్డు భవనాల శాఖ ఇవ్వాలా? రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ఇవ్వాలా? అనేదానిపై మల్లగుల్లాలు జరుగుతున్నాయి. కొత్తగా ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాల్లో అసలు అలైన్‌మెంట్ మీదే వ్యాఖ్యలు చేసింది. చెట్లు, వన్యప్రాణుల సంరక్షణ కోసం మేలైన విధంగా అలైన్‌మెంట్ మార్పులు చేసే అవకాశాలు పరిశీలించమంది. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జడ్ఎస్ఐ) ద్వారా అధ్యాయనం చేసి నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో మళ్లీ ఈఐఏ ఎలా చేయాలనేదానిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

పశువైద్యానికి మందులు కరువు



ధారూరులోని వెటర్నరీ ఆస్పత్రి

ధారూరు, మే13(ఆంధ్రజ్యోతి): పశువుల, పెంపుడు జంతువుల వైద్యానికి అవసరమైన మందులు అందుబాటులో గ్రామల్లో మూగ జీవాలకు వైద్యం అందడం లేదు. కొన్ని నెలలుగా పశువైద్యశాలలకు మందుల సరఫరా నిలిచి మందుల కొరత ఏర్పడింది. ఉన్న నామమాత్ర మందులతో సిబ్బంది పశువులకు వైద్యం చేస్తున్నారు. అయోడిన్ ద్రావణం కూడా పశువైద్యశాలల్లో లేదు. ధారూరు పశు వైద్యశాలలో అవసరమైన మందులు లేక రైతులే మెడికల్ షాపుల్లో కొనుక్కొచ్చి పశువులకు వైద్యం చేయిస్తున్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్క, పిల్లి వంటి పెంపుడు జంతువులకు వైద్యం అందించేందుకు అవసరమున్న మందులు వెటర్నరీ ఆస్పత్రుల్లో లేవు. వివిధ రోగాలకు, సీజనల్ వ్యాధులకు వైద్యం సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. పశు వైద్యశాలల్లో పెన్సిలిన్, మెలనెక్స్, ఏవిల్, హైపోక్లోర్, ప్రెడినిసోలోన్, ఎన్రో ఇంజక్షన్లు, అయోడిన్, టర్పెంటాయిల్ వంటి నిత్యం అవసరం అయ్యే మందుల నిల్వలు రెండు నెలలుగా లేవు. అరకొరగా ఉన్న ఆక్సిటెట్రాసైక్లిన్, న్యూరాక్సిన్, బెర్నిల్, హైటెక్, క్యాల్-డి లాంటి మందులతో పశువులకు వైద్యం చేస్తున్నారు. అవసరమైన మందులు లేక రైతులు మెడికల్ షాపుల్లో వందలాది రూపాయలు వెచ్చించి తీసుకొస్తే వాటిని వైద్యులు, కాంపౌండర్లు పశువులకు ఇస్తున్నారు. మందుల కొరతపై మండల పశువైద్యాధికారి కుమారస్వామి స్పందిస్తూ.. పశువైద్యశాలకు కొన్ని మందుల సరఫరా లేదని చెప్పారు. అవసరమైన కొన్ని మందులు, ఇంజక్షన్లు అందుబాటులో లేవన్నారు. ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టామన్నారు. ఉన్న మందులతో పశువులకు వైద్యం చేస్తున్నామని చెప్పారు. లేనివి మెడికల్ షాపుల్లో రైతులు కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు.

నేతల హౌస్ అరెస్టు
అప్రజాస్వామికం

వికారాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై ఉద్యమిస్తున్న మహిళా సంఘాల నేతలను హైదరాబాద్‌లో ఎక్కడికక్కడ గృహ నిర్బంధాలు చేయడం అక్రమం అని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి వై.గీత అన్నారు. మంగళవారం పట్టణంలో ఆమె మాట్లాడుతూ.. మహిళల అంగ ప్రదర్శనను ప్రోత్సహించే ఇలాంటి పోటీలు రాష్ట్ర సాంస్కృతిక విలువలను నాశనం చేస్తాయన్నారు. తెలంగాణలో విశ్వసుందరి పోటీలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రం ఈ పోటీల కోసం రూ.300కోట్లు ఖర్చు చేయడం అవివేకం అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరసిస్తున్న ప్రజాసంఘాల, ఐక్యవేదికల నాయకులు సంధ్య, మల్లు లక్ష్మి, తదితరులను పోలీసులు హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు.

నేవీ రాడార్ స్టేషన్‌కు భూమి అప్పగింత అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న హరగోపాల్

రాంనగర్/ యాచారం, మే 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా రామగుండం అటవీ ప్రాంతాన్ని నేవీ రాడార్ స్టేషన్ నెలకొల్పేందుకు అప్పగించడం అన్యాయమని టీపీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, ప్రజాశాస్త్రవేత్త బాబూరావు, టీపీజేఏసీ కోకన్వీనర్లు రవి, నాగయ్య, రవిచంద్ర, మైసా శ్రీనివాస్, డా.వనమాల అన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో.. 'తెలంగాణలో కొనసాగుతున్న అభివృద్ధి నమూనా ప్రజానుకూలమేనా?' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ఏపీఎం జాతీయ కమిటీ సభ్యులు మీరా సంఘమిత్ర, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శంకర్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కవుల సరస్వతి తదితరులు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ.. ఫార్మాసిటీ ఇథనాల్ కంపెనీలు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు కాలుష్యకారక పరిశ్రమలని, వాటిని తెలంగాణలో ప్రోత్సహించొద్దని, ఇప్పటికే ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి నమూనా దారి తప్పిందన్నారు. భూసేకరణకు 2013 చట్టానికి బదులు 2017 భూసేకరణ చట్టాన్ని అమలు చేయడం అన్యాయం అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ లాంటి మూడు నగరాల మధ్యలో ఫ్యూచర్‌సిటీ అవసరమా అని ప్రశ్నించారు. ఇందుకు 35వేల ఎకరాల భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రైతుల హక్కుల వేదిక నాయకులు ఆశాలత, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కిరణ్‌కుమార్, ఫార్మాసిటీ చిత్తనూరు ప్రాంత రైతులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఎలిమినేడులో ఎల్లమ్మ కల్యాణోత్సవం

ఇబ్రహీంపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధి ఎలిమినేడులో మంగళవారం రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ప్రార్థించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలను తీసుకొస్తామని, యువతకు ఉపాధి కల్పిస్తామని ఆయన అన్నారు. నాయకులు మంకాల శేఖర్‌రెడ్డి, ఈసీ శేఖర్‌గౌడ్, బి.మహిపాల్, జడల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి తరలుతున్న భక్తులు

ఘనంగా కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర

» మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

తాండూరురూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దుకొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జాతర ఘనంగా కొనసాగుతోంది. జాతర మొదటి మంగళవారం సందర్భంగా కర్ణాట ప్రాంత భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు ఆలయ ప్రాంగణంలో వేపచీర ధరించి బోనాలతో మొక్కులు చెల్లించారు. మరికొందరు గండజ్యోతి ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో 16సీసీ కెమెరాలు, కొత్లాపూర్‌లో 10సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఎస్సై విఠల్‌రెడ్డిని ఆయన ఆదేశించారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఎండోమెంట్ ఈవో శేఖర్‌గౌడ్ డీఎస్పీ, ఎస్సైలను సన్మానించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ నిర్మాణ దాత, కర్ణాటక విద్యాశాఖ మాజీ మంత్రి అరవింద లింబావళి తన అనుచరులను పంపించారు.

యువ వికాసం దరఖాస్తుల
పరిశీలన పూర్తి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

చౌదరిగూడ, మే 13(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం స్కీంకు దరఖాస్తు చేసుకున్న వారు సిబిల్ స్కోర్ చెకింగ్ కోసం వారి ఆధార్, పాన్‌కార్డులను బ్యాంకుల్లో అందించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్‌లో బ్యాంకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి వివరాలను బ్యాంకు అధికారులకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో హన్మంతరెడ్డి, ఏపీఎం నరసింహ, కార్పొరేషన్ సిబ్బంది రాజు, వీరప్రసాద్, నయూమ్, బ్యాంకు అధికారులు హరికృష్ణ, అశోక్, శ్రవణ్, ప్రియాంక, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీ పునర్‌వైభవానికి కృషిచేయాలి



పార్టీ పదవులకు పేర్లను స్వీకరిస్తున్న అశోక్‌గౌడ్

కీసర, మే13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పునర్‌వైభవానికి ప్రతీ ఒక్కరు కృషిచేయాలని మాల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు కందికంటి అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్ పరిధి భోగారం అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి సుంకరి వెంకటేశ్ అధ్యక్షతన స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. నగరానికి చేరువలోనే ఉన్న మేడ్చల్ జిల్లాలో గ్రామాలన్నీ పట్టణాలుగా రూపాంతరం చెందాయన్నారు. అన్ని గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం అయ్యాయన్నారు. ప్రస్తుతం జిల్లా ఎక్కువ శాతం జీహెచ్ఎంసీలో భాగంగా ఉందని, అలాగే 9మున్సిపాలిటీలున్నాయని తెలిపారు. పార్టీ పటిష్టానికి త్వరలోనే మున్సిపాలిటీల్లో పార్టీ అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను నియమిస్తామని అశోక్‌గౌడ్ తెలిపారు. ఇప్పటికే నాయకుల పేర్లను నమోదు చేశామని, వివరాలను అధిష్ఠానానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సతీశ్, హరికృష్ణ, వేము సంజీవ, జంగారెడ్డి, వెంకటరమణ, మహేశ్, సురేందర్, మీనయ్య, శంకరయ్య, కృష్ణారావు, టి.శంకర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవునిగుట్టపై సత్యనారాయణ వ్రతాలు



ఉట్లపల్లిలో సత్యనారాయణ వ్రతంలో భక్తులు

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఉట్లపల్లిలోని దేవునిగుట్టపై లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సత్యనారాయణ వ్రతాలు చేశారు. నిర్వాహకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పండితులు రేవెళ్ల రాజుశర్మ నేతృత్వంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఐదు రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవి, సుధాకర్, అనిల్, చెన్నయ్య, మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో కల్యాణాన్ని జరిపిస్తున్న పూజారులు

కనులపండువగా ఎల్లమ్మ, జమదగ్నిల పరిణయం

ఘట్‌కేసర్, మే 13(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం 36వ వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. పూజలకు ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, రాంపల్లి, వివిధ కాలనీల ప్రజలు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, డీసీసీ చైర్మన్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నాయకులు మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశోక్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలిక ఆదాయం



- ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు

ఫేస్ టు ఫేస్

కేశంపేట, మే 13(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులు సాగు చేస్తే దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చని షాద్‌నగర్ ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ సాగు, తదితర విషయాలపై ఆమె 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న : ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నారా?

జవాబు : ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులను ఎంపిక చేస్తున్నాం. భూమి ఎంత ఉండాలన్న నిబంధన లేదు. ఆయిల్‌పామ్ సాగు చేయడానికి ముందుకు వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఇతర రైతులను ఎంపిక చేస్తున్నాం.

ప్రశ్న : ఆయిల్ పామ్ మొక్కలను ఎక్కడ తీసుకోవాలి?

జవాబు : ఆయిల్ పామ్ మొక్కలను ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది. రైతులు నామమాత్రంగా రూ.20 చెల్లించాలి. రూ.193 విలువచేసే మొక్కను రైతుకు అందిస్తాం.

ప్రశ్న: ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం అందిస్తుంది?

జవాబు : ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులను ప్రోత్సహించేందుకు ప్రతీ సంవత్సరం ఎరువుల నిమిత్తం రూ.4,200 అందిస్తుంది. ఇలా నాలుగేళ్ల పాటు అందిస్తుంది. ఆ తరువాత ఆయిల్ పామ్ కాతకు వస్తుంది. దాంతో రైతుకు ఆదాయం వస్తుంది.

ప్రశ్న : షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎంత విస్తీర్ణంలో సాగవుతోంది?

జవాబు : కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొత్తూర్, నందిగామ, కొందుర్గు, చౌదరిగూడలో సాగు చేస్తున్నారు. 243 మంది రైతులు 841.235 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కేశంపేట మండలంలో అత్యధికంగా 86 మంది రైతులు 326 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు.

ప్రశ్న : ఆయిల్ పామ్ ఎన్ని సంవత్సరాలు కాపు ఇస్తుంది?

జవాబు : ఒక్కసారి సాగేచేస్తే దీర్ఘకాలిక ఆదాయం వస్తుంది. 4వ ఏట నుంచి కాత వస్తుంది. 30 ఏళ్ల వరకు కొనసాగుతుంది. ఎకరాకు ఖర్చులు పోను రూ.లక్ష ఆదాయం వస్తుంది.

తొమ్మిదేళ్లుగా అద్దె భవనంలోనే..

- సొంత భవనానికి నోచుకోని కడ్తాల మండల పరిషత్ కార్యాలయం
- నిధుల లేమితో నిలిచిన నిర్మాణ పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



అసంపూర్తిగా మండల పరిషత్ కార్యాలయ భవనం

కడ్తాల్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలానికి ప్రధాన పరిపాలనా కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయం ఏళ్లకాలంగా అసౌకర్యాల అద్దె భవనంలో కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబరు 11న పాలనా సౌలభ్యం కొరకు కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటులో భాగంగా కడ్తాల ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. మండల పరిషత్ కార్యాలయానికి 9ఏళ్లు అయినా నేటికీ సొంత భవనం లేదు. జాతీయ రహదారి పక్కన ఓ ప్రైవేట్ భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. కార్యాలయాలనికి అనుగుణంగా లేని భవనంతో అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో సమావేశాల నిర్వాహణకు అనువైన హాల్ లేక రేకుల షెడ్డులో మండల పరిషత్ సమావేశాలు, అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న కడ్తాలలో మండల పరిషత్‌కు సొంత భవనం నిర్మించాలని ఆరేళ్ల కాలంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని రైతువేదిక వద్ద గల వెంచర్‌లో జీపీ పది శాతం భూమిలో భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు.

రూ.50లక్షల ఎస్డీఎఫ్ నిధులు మంజూరు

కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.50లక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 సెప్టెంబరు 8న అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ నిధులున్నంత వరకు పనులు చేపట్టాడు. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ నిర్మాణంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అదనపు నిధులు మంజూరు కాకపోవడం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడం, ఎన్నికలు రావడంతో నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. అసంపూర్తి పనులకు మరో రూ.కోటి అవసరముందని అధికారులు పేర్కొంటున్నారు. జీ-ప్లస్ వన్ భవన నిర్మాణానికి ప్రతిపాదించారు. దీనికితోడు చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. అదనపు నిధుల మంజూరు గూర్చి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



భవన నిర్మాణం పూర్తికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించాం. గతంలో రూ.50 లక్షలు కేటాయించగా స్లాబ్ నిర్మాణం వరకు గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తయ్యింది. నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మరో రూ.కోటి మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

- దార్ల వరమేశ్, ఏఈ, కడ్తాల్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



అసంపూర్తి పనులు త్వరలో పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. మండల పరిషత్ కార్యాలయానికి అదనపు నిధుల గూర్చి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయాం. రూ.కోటి నిధుల మంజూరుకు ఎమ్మెల్యే అధికారులకు ప్రతిపాదనలు పంపారు.

- గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ, కడ్తాల్

క్రైం కార్నర్

రెండు బైకులు ఢీ.. ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



అంబులెన్స్‌లో సోమ్లానాయక్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కడ్తాల్, మే 13(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కడ్తాల్- అన్మాస్‌పల్లి ప్రధాన రహదారిపై ఈ సంఘటన చోటుచేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని గాన్గుమర్ల తండాకు చెందిన లారీడ్రైవర్ మూడావత్ సోమ్లానాయక్ (38) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై గాన్గుమర్ల తండా నుంచి కడ్తాల్ వైపు వస్తున్నాడు. అదే సమయంలో అన్మాస్‌పల్లి వైపు పల్సర్ బైక్‌పై రామస్వామి వెళ్తున్నాడు. కడ్తాల సమీపంలోని అన్మాస్‌పల్లి రోడ్డులో ఇద్దరి బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో సోమ్లానాయక్, రామస్వామిలు తీవ్రంగా గాయపడ్డారు. సోమ్లానాయక్‌ను ఆయన బంధువులు మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిన తెలిపారు. మృతుడు సోమ్లానాయక్ సోదరుడు పాండు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..



రాజు(ఫైల్)

కందుకూరు, మే 13(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన పోల్‌దాస్ రాజు(40) సోమవారం రాత్రి మండల కేంద్ర నుంచి గూడూరు గ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. ఈక్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. దాంతో రాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ సీతారాం తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట, మే 13(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగిళ్ల అంజయ్య(50) చాలా కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఈనెల 10న శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఆ తరువాత గమనించిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న అంజయ్యను షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడు అంజ య్య భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అయితే, నాగిళ్ల అంజయ్య మృతిపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హక్కుల సాధనకు ముందుకు సాగాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెంటయ్య తదితరులు

తలకొండపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని ఆరోపించారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో మంగళవారం ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి పెంటయ్య హాజరై కార్మికులతో కలిసి సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు, సంపన్న వర్గాల కొమ్ము కాస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి.. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికులకు పెరిగిన నిత్యావసర ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఇంకెప్పుడు?

- ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పాతది కూల్చివేత
- పనులు మొదలు కాలేదని లబ్ధిదారు ఆవేదన



పాత ఇంటి అడుగులో పునాది తీసి తిరిగి పూడ్చిన స్థలం.. ఇన్‌సెట్‌లో చంద్రమ్మ

కేశంపేట, మే 13(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లువిరిసింది. అయితే, స్థలం లేకపోవడంతో పాత ఇంటిని కూల్చివేశారు. అధికారులు ఇంటి నిర్మాణానికి ఎప్పుడు ముగ్గు పోస్తారో తెలియక అయోమయంలో పడిపోయారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన పోగుల చంద్రమ్మకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దాంతో పాత ఇంటిని కూల్చివేసింది. అధికారుల సూచన మేరకు మొదట ముగ్గు పోసుకొని పిల్లర్ల కొరకు గుంతలు తీసింది. స్టీల్, సిమెంట్ అరువుపై తెచ్చుకుంది. తీరా పనులు మొదలుపెట్టే సమయంలో ప్రభుత్వం సూచన ప్రకారమే ఇల్లు కట్టుకోవాలని, పైనుంచి ఆదేశాలు వచ్చేవరకు ముగ్గు పోయరాదని అధికారులు చెప్పడంతో చంద్రమ్మ ఖంగుతింది. దాంతో పిల్లర్ల కొరకు తీసిన గుంతలను పూడ్చివేసింది. పాత ఇంటిని కూల్చివేసుకోవడంతో గత్యంతరం లేక అంబేడ్కర్ భవన్‌లో భర్త రామచంద్రయ్య, కుమారుడు శ్రీశైలంతో కలిసి ఉంటోంది. పనులు మొదలు కాకపోవడంతో చంద్రమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారులు త్వరగా ఇంటి పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

సేంద్రియ ఎరువులు వాడాలి



శంషాబాద్ రూరల్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్/యాచారం, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులు వాడాలని శాస్త్రవేత్తలు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం శంషాబాద్ మండలంలోని కవేలిగూడ రైతు వేదికలో పంటల సాగుపై శాస్త్రవేత్తలు సుకృత్‌కుమార్, శంకర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ప్రతీ సంవత్సరం పంట మార్పిడి చేయడంతో భూ సారం పెరుగుతుందన్నారు. ఆధునిక పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేయడంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ సత్తయ్య, మండల వ్యవసాయ అధికారి శ్వేత, విస్తరణాధికారి సురేశ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు. అలాగే చీడపీడల నివారణకు సేంద్రియ ఎరువులనే వాడుకోవాలని, పంటల ఉత్పత్తులు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో పాటు పోషకాలు అధికంగా ఉంటాయని శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణబాబు రైతులకు సూచించారు. మంగళవారం యాచారంమండలంలోని తక్కళ్లపల్లితండాలో పర్యటించి రైతులతో సమావేశమై చీడపీడల నివారణపై పలు సూచనలు చేశారు. ఫంగిసైట్ల కనిష్ఠ వినియోగాన్ని ప్రోత్సహించాలని వివరించారు. మైక్రోఇరిగేషన్ డ్రిప్‌ల సాయంతో పంటలకు నీరు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ర వినాథ్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం : తక్కళ్లపల్లితండాలో సూచనలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణబాబు

ఒక్కరి నేత్ర దానం.. ఇద్దరికి దృష్టి భాగ్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న యాదయ్య

ఆమనగల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య అన్నారు. మరణానంతరం నేత్ర దానం చేయడానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా యాదయ్య ప్రారంభించారు. వైద్య సహాయకుడు ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 72మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 45 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఐవోఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. నేత్ర సంరక్షణ గురించి చంద్రశేఖర్ ప్రజలకు అవగాహన కల్పించారు. లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి కోరారు. లయన్స్‌క్లబ్ పీఆర్‌వో పాష, సం యుక్త కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులు కొండల్‌రెడ్డి, వైద్యసిబ్బం ది తిరుపతిరెడ్డి, వేణు, శేఖర్, శ్రీను, పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. విద్యుత్ కోత

(5వ పేజీ తరువాయి)

కీలకంగా మారింది. వేసవి కావడంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌ల వాడకం సహజం. దీంతో విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఫీడర్ల సంఖ్యను పెంచి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. కానీ, ఇప్పటికీ ఇంకా కాలంచెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

లైన్‌మెన్లపైనే భారం!

ఇక్కడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 18మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే పనిచేస్తున్నారు. 28 వార్డులు ఉన్నటువంటి మున్సిపాలిటీలో ఒక్కో లైన్‌మ్యాన్‌కు ఐదు నుంచి ఆరు వార్డులు కేటాయించాల్సి వస్తోంది. అంతేకాకుండా లింగారెడ్డిగూడ, నాగులపల్లి, రాసుమల్లగూడ లాంటి గ్రామాల భారాన్ని కూడా ఈ లైన్‌మెన్లే మోయాల్సి వస్తుంది. విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ బిల్లుల సేకరణ బాధ్యతను కూడా లైన్‌మెన్లకే అప్పజెప్పడం గమనార్హం. కేవలం ఐదుగురిపైనే ఇంతటి భారాలను మోపుతుండటం వల్ల సదరు లైన్‌మెన్లు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై దృష్టి సారించి పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి కృషి



గ్రామస్తులకు నగదు, చెక్కును అందజేస్తున్న దాతలు

షాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి) : షాబాద్‌లోని శివాలయం పునర్నిర్మాణానికి కృషి చేస్తామని రాష్ట్ర హాకీ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం షాబాద్‌లో శివాలయం పునర్నిర్మాణమై సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణం కోసం రూ.40లక్షల వరకు ఖర్చు అవుతుందని నిర్ణయించారు. తనవంతుగా విజయ్‌కుమార్ రూ.5లక్షలు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఏగూరి లింగప్ప రూ.5లక్షల చెక్కును గ్రామస్తులకు అందజేశారు. మరికొంత మంది దాతలు కూడా విరాళాలను త్వరలో అందిస్తామని, ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. శ్రీనుపంతులు, తమ్మలి రవీందర్, అశోక్, రవీందర్‌గౌడ్, సుధీర్, ప్రవీణ్, రాహుల్, నర్సింహులు, సత్యనారాయణ, పర్వవేది, మదన్, చంద్రయ్య, గౌరీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

ఆమనగల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డ్‌లలోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి కోరారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోలును మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. తుకాలు వేగవంతం చేయాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. చైర్‌పర్సన్ గీతనర్సింహ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కేంద్రాన్ని సందర్శించి రైతులకు భోజనం వడ్డించారు. మార్కెట్ యార్డ్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సిబ్బంది, వినోద్, కిరణ్, శరత్, రాములు, నాయకులు పర్వతాలు, విజేందర్, శ్రీశైలం, తదితరులున్నారు.

హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం : భజరంగ్‌దళ్

కొత్తూర్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న నిర్వహించే హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని స్థానిక భజరంగ్‌దళ్ నాయకులు తెలిపారు. ఈమేరకు స్థానిక హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భజరంగ్‌దళ్, హిందూసంఘాల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ హనుమాన్ జయంతి రోజు భారీ శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. హిందువులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌చారి, నరేశ్‌చారి, శేఖర్‌గౌడ్, నర్సింహ, మురళి, ప్రశాంత్, హర్షయాదవ్, సందీప్‌సింగ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భజరంగ్‌దళ్ నాయకులు

అభివృద్ధి పనులకు నిధులు విడుదల

యాచారం, మే 13(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని ఏడు గ్రామాలలో 2024-25సంవత్సరానికి గాను 220 పనులకు రూ.1980లక్షల నిధులను టీజీఐఐసీ అధికారులు విడుదల చేశారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వెల్లడించారు. కుర్మిద్దలో 46 పనులకు రూ.425లక్షలు, మంగలిగడ్డతండాలో 10 పనులకు రూ.38లక్షలు, మర్లకుంటతండాలో 6 పనులకు రూ.26లక్షలు, నానక్‌నగర్‌లో 10 పనులకు రూ.108లక్షలు, తక్కళ్లపల్లితండాలో 6 పనులకు రూ.82లక్షలు, తక్కళ్లపల్లిలో 23 పనులకుగాను రూ. 313లక్షలు విడుదలయ్యాయని చెప్పారు. అలాగే కొత్తపల్లిలో 21 అభివృద్ధి పనులకు రూ.124లక్షలు, మేడిపల్లిలో 26 పనులకు రూ.222లక్షలు, తాటిపర్తిలో 55 పనులకు రూ.641 లక్షల నిధులు విడుదలయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కడ్తాల్, మే 13(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ విడుదల చేసిన 10, 12వ తరగతి ఫలితాల్లో కడ్తాల ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 10వ తరగతి ఫలితాల్లో రాజ్ సిద్ధార్థ్ 549 మార్కులు సాధించి మొదటి స్థానం, నాగుల లిఖిత్ 544 మార్కులతో రెండో స్థానంలో, చరక వైష్ణవి 538 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. 12వ తరగతిలో అఖిల్ 552 మార్కులతో మొదటి స్థానంలో, సంజన 546 మార్కులతో రెండో స్థానంలో, రోషిణి 522 మార్కులతో మూడో స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం సంజీవ్ నాంపల్లి తెలిపారు. రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను స్కూల్ వ్యవస్థాపకులు శేషగిరిరావు, సహ వ్యవస్థాపకులు రమేశ్‌లు అభినందించారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ



లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

ఆమనగల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు లక్ష్మారెడ్డిని మంగళవారం ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల లక్ష్మారెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకొని విశ్రాంతి పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, కృష్ణయాదవ్, బీజేపీ నాయకులు రవిరాథోడ్, రామస్వామిలు చింతలపల్లిలోని ఆయన నివాసంలో లక్ష్మారెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

రేపటి నుంచి వీరనాగమ్మ కల్యాణ మహోత్సవం



వీరనాగమ్మ దేవాలయం

కేశంపేట, మే 13(ఆంధ్రజ్యోతి): ఆరెకటికల కుల దేవత వీరనాగమ్మ కల్యాణ మహోత్సవాలు రేపటి (గురువారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు మండల కేంద్రంలోని ఆలయంలో 15న కంకణ ధారణ, సాయంత్రం పుట్టపూజ, రాత్రి 8 గంటలకు దుర్మలయ్య పూజ, 16న ఉదయం వీరనాగమ్మ దేవత ఊరేగింపు, గంగ పూజ, పుట్ట బంగారం తెచ్చుట, ఆదేరోజు మధ్యాహ్నం 2గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈసందర్భంగా వీరనాగమ్మ ఆలయాన్ని అందంగా ముస్తాబు చేస్తున్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈరనాగమ్మ ఆలయ కమిటీ సభ్యులు శివాజీ సోమవారం చెప్పారు.

అనుమతుల్లేని స్కూళ్లలో పిల్లలను చదివించొద్దు

చేవెళ్ల, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి మోసపోవద్దని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్, రాజేంద్రనగర్, వికారాబాద్, పరిగి, తాండూర్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యాసంస్థలు పనిచేయడం లేదన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 198వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశి పల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షలకు మద్దతుగా గ్రామంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మొయినాబాద్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ జడ్పీహెచ్ఎస్‌లో చదివిన 2009-10 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం మండలంలోని అజీజ్‌నగర్ పరిధిలోని ఓ రిసార్టులో ఘనంగా నిర్వహించుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. 15 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో గతాన్ని నెమరేసుకొని ఆనందంగా గడిపారు. అందరూ కలిసి భోజనం చేశారు. భవిష్యత్తులో ఎవరికి కష్టం వచ్చినా తోటి స్నేహితులు అండగా నిలబడాలనే నిర్ణయం తీసుకున్నారు. టీచర్లు తాజ్‌బాబు, అంజయ్య, కృష్ణారెడ్డి, కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.